క్లుప్తంగా

మూటపల్లిలో డీఎల్‌పీవో సందర్శన



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

రాయికల్: మండలంలోని మూటపల్లి గ్రామాన్ని సోమవారం డీఎల్‌పీవో వాసవి సందర్శించారు. గ్రామంలో నర్సరీ, వైకుంఠధామం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గ్రామంలో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీవో సుష్మ ఉన్నారు.

టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రామకృష్ణ

జగిత్యాల: ప్రతీ విద్యార్థి టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్‌ఎస్‌వీ డిగ్రీ కళాశాల చైర్మన్ రామకృష్ణ అన్నారు. సోమవారం డిగ్రీ విద్యను ఎందుకు ఉన్నతంగా చదవాలన్న అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ సైతం ఎంతో ముఖ్యమని, విద్యార్థులు బాగా చదివితే అందులో సైతం ఎన్నో అవకాశాలుంటాయన్నారు. టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటూ బజాజ్, రుబీఖాన్, దేశ్‌పాండే ఫౌండేషన్ లాంటి ఎన్నో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ నరేశ్, మునీందర్‌రెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో కేంద్రం నిధులే అధికం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

కథలాపూర్: గ్రామాల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ నిధులు అధికంగా ఉన్నాయని మండల బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం గంభీర్‌పూర్, పెగ్గెర్ల, కథలాపూర్, చింతకుంట గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను వివరిస్తూ ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం మండలాధ్యక్షుడు ఆరె శివ, బీజేపీ మండల నాయకులు గాంధారి శ్రీనివాస్, మహేశ్, గట్ల అంజయ్య, ప్రభు, రాజేశ్, అశోక్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

గంగాదేవి ఆలయానికి భూమిపూజ

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సోమవారం చింతలచెరువు కట్టపై గంగాదేవి ఆలయానికి భూమిపూజ నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామ నాయకులు గంగారెడ్డి, సాయగౌడ్, వేణు, సామల్ల వేణు, ఆదిరెడ్డి, నీరటి శ్రీనివాస్, రాజేందర్‌గౌడ్, స్వామిరెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

కోరుట్ల: పట్టణంలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు. పట్టణంలో సోమవారం పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రూ. 21,500 వరకూ జరిమానా విధించినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, జగదీశ్, మహేశ్, పాల్గొన్నారు.

వాల్గొండకు ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలి

మల్లాపూర్: వాల్గొండ గ్రామానికి ఆర్టీసీ సేవలను పునరుద్ధరించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల కాంతయ్యచారి అన్నారు. సోమవారం కొత్తదాంరాజుపల్లిలో మాట్లాడారు. మండలంలోని వాల్గొండ గ్రామానికి వయా రాఘవపేట, మొగిలిపేట, పాత దాంరాజుపల్లి మీదుగా గత 30 ఏళ్లుగా అందించిన ఆర్టీసీ బస్సు సేవలను నిలిపివేయడంతో ఐదు, ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందరి సౌకర్యం కోసం బస్సుల సేవలను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు గజ్జి శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరస్తులపై ‘పీడీ’కిలి

- జిల్లా ఆవిర్భావం నుంచి 27 మందిపై యాక్ట్
- నేరాల అదుపునకు పోలీస్ శాఖ అమలు

● 2019లో శాంతిభద్రతల పర్యవేక్షణకు విఘాతం కలిగించిన వారిపై ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై, మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై పీడీయాక్ట్ నమోదు చేశారు.

2021లో ఇబ్రహీంపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై యాసిడ్ దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులపై పీడీయాక్ట్ తెరిచారు. అలాగే మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై పీడీయాక్ట్ తెరిచారు.

\+ 2022లో సెప్టెంబర్ 5న గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామంలో మైనర్ అమ్మాయిలపై లైంగిక దాడికి పాల్పడ్డ కొడిమ్యాల హరికృష్ణపై పీడీయాక్ట్ అమలు చేశారు. అలాగే ధర్మపురి, సారంగాపూర్, జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడ్డ జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామానికి చెందిన చేని సంతోష్, హబ్సీపూర్ గ్రామానికి చెందిన గాదె అంజయ్యలపై పీడీయాక్ట్ తెరిచారు.

జిల్లా ఆవిర్భావం నుంచి నమోదైన పీడీయాక్ట్‌లు : 27	
యాసిడ్ దాడిలో	3
చీటింగ్‌లో	1
హత్యల్లో	16
దొంగతనాల్లో	6
అత్యాచారంలో	1



నిందితులకు పీడీయాక్ట్ పత్రాలు అందజేస్తున్న పోలీసులు (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో వరుస నేరాలకు పాల్పడుతున్న వారిని తిరిగి నేరాలకు పాల్పడకుండా, చేసిన నేరాలను పరిగణనలోకి తీసుకుని నేరస్తులపై పీడీయాక్ట్ కేసులు నమోదు చేసి నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లాలోని సాధారణ ప్రజల్లో భయాందోళన సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ నేరాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదై, మళ్లీ నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై పీడీయాక్ట్‌లు అమలు చేస్తున్నారు. జగిత్యాల జిల్లా ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు పలు నేరాల్లో ప్రమేయం ఉన్న 27 మంది నేరస్తులపై జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు కలెక్టర్లు 27 మందిపై పీడీయాక్ట్ నమోదు చేయడంతో వారిని జైలులో పెడుతున్నారు.

నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పీడీయాక్ట్

జిల్లాలో మహిళ వేధింపులు, నిత్యం రేషన్ బియ్యం కొనుగోళ్లు, గల్ఫ్ మోసాలు, వరుస దొంగతనాలు, మోసాలు మహిళలను లైంగికంగా వేధించిన వ్యక్తులపై జిల్లాలో పీడీయాక్ట్ నమోదు చేస్తున్నారు. పీడీయాక్ట్ నమోదుతో నేరస్తులు ఎక్కువకాలం జైలులోనే మగ్గుతారు. సుమారు ఏడాది పాటు వీరికి బెయిల్ దొరికే అవకాశం లేదు. దీంతో జైలులో ఉంటే సత్ప్రవర్తన చెందుతారని పోలీసులు వారిపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలులో పెడుతున్నారు.

త్వరగా శిక్షలు

జిల్లాలో వరుస నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలులో పెడుతున్నారు. జైలులో ఉన్న వ్యక్తుల కేసుల ట్రయల్స్ త్వరగా పూర్తయి ఆధారాలు లభిస్తే వారికి జైలు శిక్ష పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో నేరస్తులు జైలులో ఉంటే తిరిగి నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేస్తున్నారు.

నియంత్రణ చట్టం అమలు

వరుస నేరాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు గుర్తించి వారు మళ్లీ తిరిగి నేరం చేయకుండా నియంత్రణ చట్టం 1986 (చట్టం సంఖ్య 1/986 తెలంగాణ నియంత్రణ చట్టం ద్వారా పీడీయాక్ట్ చట్టం నేరస్తులపై అమలు చేస్తున్నారు.

శాంతిభద్రతలు అరికట్టేందుకు పీడీ యాక్ట్



జిల్లాలో వరుస నేరాలకు పాల్పడి శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న వారిపై ప్రభుత్వ నిబంధనల మేర కు పీడీయాక్ట్ కేసు నమోదు చేస్తున్నాం. దీంతో నేరస్తులు జైలులో ఉండటంతో నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేయవచ్చు. వరుస నేరాలకు పాల్పడుతూ సాధారణ ప్రజలను శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై పీడీయాక్ట్ నమోదు చేశాం.

– అశోక్‌కుమార్, ఎస్పీ



కథలాపూర్: కోరుట్ల - వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండలం కలిగోట గ్రామంలో బస్టాండ్ వద్ద తారు రోడ్డుపై ఇసుక పేరుకుపోవడంతో బైక్‌లపై వెళ్లేవారు ప్రమాదానికి గురవుతున్నారు. తారు రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకను అధికారులు ఎప్పటికప్పుడు తొలగిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్, ఆర్‌అండ్‌బీ ఏఈ,కథలాపూర్, సెల్ నంబర్ : 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

‘అబద్ధాలు మానుకో సంజయ్’



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల/మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన పట్ల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తుంటే గిట్టని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అసత్య ఆరోపణలు, అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని నడికుడలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి మాట్లాడారు. పోలీసులు కార్యకర్తల వ్యవహరిస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఎక్స్ వేదికగా ఆరోపిస్తూ డీజీపీకి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాప్రభుత్వంలో అందరికీ స్వేచ్ఛను కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని, గత ప్రభుత్వంలాగ అక్రమ అరెస్టులు, నిర్బంధాలు ప్రజాప్రభుత్వం చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పలికిమాలిన విమర్శలు, అబద్ధాలు మానుకోని, చేతనైతే ప్రజాప్రభుత్వానికి సహకరిస్తూ అభివృద్ధి, సంక్షేమానికై సలహాలు, సూచనలు ఇవ్వాలని హితవుపలికారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూం4.డ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల పట్ల బీఆర్‌ఎస్‌ది కపట ప్రేమ

మెట్‌పల్లి: పేదల పట్ల గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కపట ప్రేమను చూపిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని ఎస్సారెస్పీ కల్యాణ మండపంలో సోమవారం రేషన్ కార్డుల పంపిణీ చేశారు.బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడం వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టమైనవి



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో మమత



రామాజీపేటలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

జగిత్యాల రూరల్/ కథలాపూర్/ ఇబ్రహీంపట్నం /మేడిపల్లి/మల్లాపూర్: తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమైనవని, గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సీడీపీవో మమత అన్నారు. సోమవారం జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో,ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామంలో తల్లి పాల వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్ డబ్బులు పెంచి ఇవ్వాలి



మాట్లాడుతున్న లక్ష్మీరాజం

కథలాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులతోపాటు ఇతర పింఛన్ డబ్బులు పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కాశవత్తుల లక్ష్మీరాజం డిమాండ్ చేశారు. సోమవారం కథలాపూర్ మండలం భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో దివ్యాంగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 6న జగిత్యాలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తున్నారని, దివ్యాంగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈనెల 13న హైదరాబాద్‌లో దివ్యాంగులకు మద్దతుగా నిర్వహించే బహిరంగసభకు అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చెట్‌పల్లి లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు వినోద్, దివ్యాంగుల సంఘం నాయకులు రవినాయక్, తీట్ల శంకర్, బైర రాజేశ్, వీర్ల రాజేందర్, రైమన్ భూమయ్య పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

మల్యాల: ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం కింద రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ తెలిపారు. మల్యాల మండలానికి బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్–154, క్నాప్సాక్ హ్యాండ్ స్ప్రేయర్–25, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్–2, పవర్ టిల్లర్–1, రోటోవేటర్–9, స్ట్రా బాయిలర్–2, పవర్ వీడర్–1 డిస్కో హారో, ఎంబీ ప్లవ్–11 పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సన్న, చిన్నకారు, ఎస్సీ,ఎస్టీ, మహిళా రైతులకు 50శాతం రాయితీ, మిగతా రైతులకు 40శాతం రాయితీపై పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు ఈ నెల 12వ తేదీ లోపు మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏవో పేర్కొన్నారు.

కొడిమ్యాల: ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం కింద మండల రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేయనున్నట్లు ఏవో జ్యోతి తెలిపారు. మండలానికి బ్యాటరీ ఆపరేటర్ స్ప్రేయర్, రోటవేటర్, బ్రష్ కట్టర్, పవర్ వీడర్ ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల రైతులు నెల 12 వ తేదీ లోపు మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏవో పేర్కొన్నారు.

మేడిపల్లి: మేడిపల్లి, భీమారం మండలాల పరిధిలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్న వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎండీ షాహిద్ అలీ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు యాభై శాతం, ఇతరులకు నలభైశాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

జగిత్యాలరూరల్: మొదటితప్పుగా భావించి చందయ్యపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్ ఎత్తివేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి రాజన్నను హాజరుఫేసింగ్‌లో పొరపాటుతో సస్పెండ్ చేశారని, ఆ సమయంలో ఆయన ఇన్‌చార్జి గ్రామంలోనూ విధుల్లో ఉన్నారని, అక్కడి గ్రామ సహాయకుడు సీఎం ఫొటో పెట్టి అటెండెన్స్ వేశాడని, ప్రభుత్వం మొదటి తప్పుగా భావించి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సంఘం జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

పెగడపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు రాబట్టేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మండలంలోని సుద్దపల్లిలో బీఆర్‌ఎస్ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. నాయకులు నర్సింహారెడ్డి, గంగాధర్, రమణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, నరేందర్‌రెడ్డి, స్వామి, తిరుపతి, రాజశేఖర్ గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల సీజ్

జగిత్యాల:నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలను సీజ్ చేసినట్లు ఎంఈవో చంద్రకళ తెలిపారు. పాఠశాలకు ఈ ఏడాదికి సంబంధించి అనుమతులు లేవని ఫిర్యాదు రావడంతో పరిశీలించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. విద్యను వ్యాపారం చేశారని, తల్లిదండ్రులను ఆకర్షించేలా ఈ–టెక్నో, కరిక్యులమ్, ఐపీఎల్ పేర్లతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు అక్రమాలిక్, ప్రణయ్, రామచంద్ర పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

రాయికల్: మండలంలోని మైతాపూర్, భూపతిపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి సోమవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తలారి నాగమణి, కమిటీ సభ్యులు తలారి రాజేశ్, బేతి రాధ, భూపతిపూర్‌లో మహేందర్ గౌడ్, జక్కుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం

వెల్గటూర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మూడేళ్ల లోపు పిల్లల తల్లిదండ్రులకు తల్లిపాల గురించి, బాలామృతం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆండాళు, టీచర్ శంకరమ్మ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీఎంలు

పెగడపల్లి:పెగడపల్లి ఐకేపీ (సెర్ప్) ఏపీఎంగా ఏ.రవివర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఎంపీగా పని చేసిన సమత ఇటీవల కోరుట్లకు బదిలీపై వెళ్లారు.

ఇబ్రహీంపట్నం ఏపీఎంగా శంకర్

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ఐకేపీ భవనంలో సోమవారం ఏపీఎంగా అన్నం శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఇంతకముందు పనిచేసిన ఏపీఎం శంకర్ మేడిపల్లికి బదిలీ అయ్యారు.

గొల్లపల్లి: మండల ఏపీఎంగా విమోచన నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

కొడిమ్యాల: మండల ఏపీఎంగా మల్లేశం నియమితులు కాగా, సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

రాజన్న ఆలయంలో శ్రావణ మాసం సందడి



పెగడపల్లి రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

పెగడపల్లి: మండల కేంద్రమైన రాజన్న ఆలయంలో శ్రావణ మాసం సందడి నెలకొంది. శ్రావణ మాసం రెండో సోమవారం భక్తులు, మహిళలు ఎక్కువ సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి షావా నిర్వహించారు. ఆలయ అర్చకులు గుండి శ్రీనివాస శర్మ, వినయ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● ‘ప్రజాదరణ చూసి ఓర్వలేకనే ఆరోపణలు’

మల్లాపూర్: బీఆర్‌ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్దం శరత్ గౌడ్ అన్నారు. సోమవారం మల్లాపూర్‌లో కొమ్ముల జీవన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసే ప్రజలు వరుస ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఆశీర్వదిస్తున్నారన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వై మండల అధ్యక్షుడు మ్యాకల సతీష్, వనతడుపుల నాగరాజు లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

● వర్షకొండ పాఠశాలలో మాక్ ఎలక్షన్

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మాక్ ఎలక్షన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొనగా, పాఠశాల లీడర్స్‌గా బాలికల నుంచి ముగ్గురు, బాలుర నుంచి ముగ్గురు పోటీలో ఉన్నారు. పాఠశాల లీడర్‌గా బాలుర విభాగం నుంచి పెసరి లోకేశ్, బాలికల విభాగం నుంచి సపా గెలుపొందినట్లు హెచ్‌ఎం అచ్చ విజయభాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

● బీర్‌పూర్ విండోలో సహకార వారోత్సవం

సారంగాపూర్: బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం అంతర్జాతీయ సహకార వారోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సహకార వ్యవస్థపై అవగాహన కల్పించి, విద్యార్థులు జామెట్రీ బాక్సులను అందజేశారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ అడాప్షన్ అధికారి స్వప్న, హెచ్‌ఎం నర్సింహమూర్తి, సీఈవో అయ్యోరి తిరుపతి, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉమెన్ లీడర్‌షిప్ అవార్డుకు సాయిశ్వరి ఎంపిక

కోరుట్ల: పట్టణానికి చెందిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మ్యాకల సాయిశ్వరీ ఉమెన్ లీడర్‌షిప్ 2025 నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5వ తేదీన తిరుపతిలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా సాయిశ్వరికి అవార్డు అందజేయనున్నారు.ఈ సందర్భంగా సాయిశ్వరిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ విష్ణు, బాలె వెంకటేశ విజయ్ కుమార్, అశోక్ పాల్గొన్నారు.

● అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మల్యాల: మండల ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల సమాచారం పోలీసులకు చేరవేయాలని మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ అన్నారు. ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంట్లోని విలువైన ఆభరణాలు బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని సూచించారు. ఆలయాల నిర్వాహకులు హుండీల నిర్వహణపై నిఘా ఉంచాలన్నారు. ఇళ్లలో చొరబడి దొంగతనాలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

● గంజాయి విక్రేత పట్టివేత

కోరుట్ల:పట్టణ శివారులోని వెటర్నరీ విశ్వవిద్యాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఎండీ.ఫయాజుల్ రెహమాన్‌ను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. అతని నుంచి 150 గ్రాముల గంజాయి, రూ.5 వేలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

● కరాటేలో విద్యార్థులకు బంగారు పతకాలు

కోరుట్ల: పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు ఆదివారం ఖమ్మంలో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొని పలువురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. సందేశ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియా వాఫ్స్‌కో కరాటే చాంపియన్‌షిప్ 2025 టోర్నమెంట్లో గ్రీన్ వుడ్ విద్యార్థులు అబ్దుల్ ముక్సిత్, శైమ మెహ్రీన్,అఫీరా ఖానం, అబ్దుల్ ముజీల్, మహమ్మద్ అబుజల్, షేక్ అమన్, లు పథకాలు సాధించినట్లు కరస్పాండెంట్ తెలిపారు. విద్యార్థులను ఆర్డీవో జీవాకర్ రెడ్డి సోమవారం అభినందించారు.

● అలరించిన డ్యాన్స్ పోటీలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఆగస్టు 22న మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో చిరంజీవి యూత్ ఆధ్వర్యంలో డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో పలువురు యువత డ్యాన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో అభిమానులు బెక్కం జనార్దన్, చిరంజీవి యూత్ అధ్యక్షుడు ఎండి.పాషా, శ్యామ్‌గౌడ్ పాల్గొన్నారు.